# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 23-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రపంచంలోని ప్రతి దేశం భారత్ తో కలిసి పనిచేయాలని కోరుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు.

- మహారాష్ట్ర శాసన సభ ఎన్నికలలో కడపటి వార్తలు అందేసరికి ఎన్డీఏ 235 స్థానాలను కైవసం చేసుకుందని అధికార వర్గాలు తెలిపాయి.

- భారతదేశ సంస్కృతికి ఈ రోజున ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభిస్తోందని కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు.

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 116వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

====================

మహారాష్ట్ర శాసన సభ ఎన్నికలలో ఎన్డీఏ విజయం సాధించింది. మొత్తం 288 శాసన సభ స్థానాలకు గానూ కడపటి వార్తలు అందేసరికి ఎన్డీఏ 235 స్థానాలను కైవసం చేసుకుందని అధికార వర్గాలు తెలిపాయి. మహా వికాస్ ఆగాఢీ 49 స్థానాలలో విజయం సాధించింది. ఇతరులు నాలుగు స్థానాలలో విజయం సాధించారు. జార్ఖండ్ శాసన సభలో మొత్తం 81 స్థానాలకు గాను జార్ఖండ్ ముక్తీ మోర్చా కూటమి 56 స్థానాలను, ఎన్డీఏ కూటమి 24 స్థానాలను గెలుచుకున్నాయి. ఇతరులు ఒక స్థానాన్ని గెలుచుకున్నారు.

====================

మహారాష్ట్ర శాసన సభ ఎన్నికలలో మహాయుతి కూటమి ఘన విజయం సాధించడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధి, సుపరిపాలనను ప్రజలు గెలిపించారని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఇంతటి చరిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టిన మహారాష్ట్ర ఓటర్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా మహిళలు, యువత వల్లనే ఈ విజయం సాధ్యపడిందని అన్నారు. మహారాష్ట్ర అభ్యున్నతికి మహాయుతి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని నరేంద్ర మోడీ హామీ ఇచ్చారు. అదే విధంగా ఝార్ఖండ్‌లో జేఎంఎం కూటమి విజయం సాధించడంతో కూటమి నేతలను ఆయన అభినందించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచంలోని ప్రతి దేశం భారత్ తో కలిసి పనిచేయాలని కోరుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. గడచిన 10 సంవత్సరాల కాలంలో అమలు చేస్తున్న సంస్కరణల కారణంగానే భారతదేశం ప్రాముఖ్యతను ఈనాడు ప్రపంచం గుర్తిస్తోందని పేర్కొన్నారు. జర్మనీలోని స్టుట్ గార్ట్ లో మీడియా హౌస్ ఈ రోజు నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానమంత్రి ఢిల్లీ నుండి దృశ్య మాధ్యమం ద్వారా పాల్గొని ప్రసంగించారు. “ఇండియా - జర్మనీ ఏ రోడ్ మ్యాప్ ఫర్ సస్టెయినబుల్ గ్రోత్” అనే అంశంతో ఈ కార్యక్రమం జరిగింది. 21వ శతాబ్ధంలో వేగవంతమైన వృద్ధిని సాధించేందుకు తనను తాను భారత్ సంసిద్ధం చేసుకుందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 27.సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ సంస్కృతికి ఈ రోజున ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభిస్తోందని కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. ఢిల్లీలో ఈ రోజు జరిగిన జాతీయ స్మారక చిహ్నాల ప్రాధికార సంస్థ 14వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలలో ఆయన మాట్లాడుతూ, దేశానికి చెందిన యోగా, వాస్తుశిల్పులకు అంతర్జాతీయ గౌరవం దక్కుతోందని తెలిపారు. దేశ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంలో స్మారక చిహ్నాల ప్రాముఖ్యత గొప్పదని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. జాతీయ స్మారక చిహ్నాలను సంరక్షిస్తున్న నేషనల్ మాన్యుమెంట్స్ అథారిటీని గజేంద్ర సింగ్ షెకావత్ అభినందించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 116వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = =

ఇంటర్నేషన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా ఇఫీ వేడుకలు గోవాలో కొనసాగుతున్నాయి. నాలగవ రోజు అయిన ఈరోజు ఫిల్మ్ బజార్ లో భాగంగా నిర్మాతల కార్యశాలను నిర్వహించారు. దీనిలో ప్రముఖ చిత్ర నిర్మాతలు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి, చలన చిత్ర నిర్మాణంలో అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఈ వేదికను ఉపయోగించుకోవాలన్నారు. అలాగే మాస్టర్ క్లాస్ సెషన్ లో తమిళ నటుడు శివకార్తికేయన్ తన సినీ ప్రయాణంలోని అనుభవాలను పంచుకున్నాడు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని 15 రాష్ట్రాలలో 48 అసెంబ్లీ స్థానాలకు, 2 లోక్ సభ స్థానాలకు ఉప ఎన్నికల జరిగాయి. కడపటి వార్తలు అందేసరికి ఈ ఉప ఎన్నికలలో 48 అసెంబ్లీ స్థానాల్లో అత్యధిక స్థానాలు ఎన్డీయే గెలుచుకుంది. అసోంలో 5 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగగా. ఐదింటిలోనూ ఎన్డీయే కూటమి విజయం సాధించింది. బీహార్‌లో నాలుగు చోట్ల ఉప ఎన్నికలు జరగగా మొత్తం స్థానాలలో ఎన్డీయే కూటమే గెలుపొందింది. ఛత్తీస్‌గడ్, గుజరాత్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఒక్కోచోట ఉప ఎన్నిక జరగగా అక్కడ కూడా బీజేపీ గెలిచింది. రాజస్థాన్‌లో 7 స్థానాలకు ఉప ఎన్నిక జరగగా ఐదింట బీజేపీ, ఒకచోట కాంగ్రెస్, మరొకచోట భారత్ ఆదివాసీ పార్టీ విజయం సాధించాయి. ఉత్తరప్రదేశ్ లో 9 స్థానాలకు ఉప

ఎన్నికలు జరగగా... ఆరుచోట్ల బీజేపీ, రెండు స్థానాల్లో ఎస్పీ, ఒకచోట ఆర్ఎల్డీ గెలుపొందాయి. మధ్యప్రదేశ్‌లో రెండు స్థానాలకు ఉప ఎన్నిక జరగగా... ఒకచోట కాంగ్రెస్, ఒకచోట బీజేపీ గెలిచాయి. కాగా కర్ణాటకలో 3 శాసన సభ స్థానాలలో కాంగ్రెస్, మేఘాలయలో ఒక స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో నేషనల్ పీపుల్స్ పార్టీ, పంజాబ్‌లో 4 స్థానాలకు ఎన్నికలు జరగగా 3 చోట్ల ఆమ్ ఆద్మీ పార్టీ, ఒకచోట కాంగ్రెస్, సిక్కింలోని 2 స్థానాల్లో సిక్కిం క్రాంతి కారీ మోర్చా, పశ్చిమ బెంగాల్‌లో 6 చోట్ల ఉప ఎన్నికలు జరగగా అన్ని స్థానాలలో తృణమూల్ కాంగ్రెస్ గెలుపొందాయి. అలాగే, 2 లోక్ సభ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరగగా కేరళలోని వయనాడ్ లోక్ సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంక గాంధీ విజయం సాధించారు. మహారాష్ట్రలోని నాందేడ్ లోక్ సభ సీటు నుంచి బీజేపీ అభ్యర్థి సంతకుక్ రావ్ విజయం సాధించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రతి సంవత్సరం నవంబర్ 26న దేశం మొత్తం రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటుంది. భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమలులోకి వచ్చింది. కానీ ఇది మొదటిసారిగా 1949 నవంబర్ 26న అధికారికంగా ఆమోదించబడింది. అందుకే భారతదేశంలో నవంబర్ 26ని రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ రోజునే జాతీయ న్యాయ దినోత్సవంగా కూడా పేర్కొంటారు.

= = = = = = = = = = = = = = = = = = = =

సహకార రంగాన్ని పటిష్టం చేయడం ద్వారా కోట్లాది మంది రైతుల జీవన ప్రమాణాలను పెంచాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. నేషనల్ కోపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎన్ సీ డీ సీ) 91వ జనరల్ కౌన్సిల్ సమావేశం ఢిల్లీలో ఈ రోజు జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అమిత్ షా మాట్లాడుతూ... సహకార రంగం ద్వారా దేశంలోని ప్రజల జీవితాలలో సానుకూలమైన మార్పులు తీసుకుని వస్తామని తెలిపారు. ఎన్ సీ డీ సీ సహకార రంగాన్ని ప్రగతి బాటన నడిపించేందుకు చర్యలు చేపడుతోందని గుర్తు చేశారు. కాగా దేశంలోని చక్కెర మిల్లుల ఆర్థిక సామర్థ్యాన్ని 25 వేల కోట్ల రూపాయలకు పెంచడానికి సమగ్ర పంచవర్ష ప్రణాళికను ప్రతిపాదిస్తున్నామని అమిత్ షా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ నెల 25న ఆకాశవాణి రంగ్ భవన్ లో నయీ చేతనా - పహల్ బద్లావ్ కీ 3వ సంచికను ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవి కూడా హాజరుకానున్నారు. నాయీ చేతన అనేది ఒక జాతీయ ప్రచారం, లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన కల్పించడం ఈ ప్రచారం ముఖ్య ఉద్దేశ్యమని అధికార వర్గాలు తెలిపాయి.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =